www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 27 జూన్ 2025
5
తిరుపతి



వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వర్షాలు కురుస్తున్న తరుణంలో పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలోని 15వ వార్డులోని పద్మావతి పార్క్, పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న తరుణంలో పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలన్నారు. వర్షపు నీరు రోడ్లపైకి రాకుండా మురుగునీటి కాలువల్లో చెత్తను తొలగించాలన్నారు. దోమలు ప్రబలకుండా మందులు పిచికారీ చేయించాలని సూచించారు. రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే అన్నా క్యాంటీన్ ను పరిశీలించి, ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు.

- శేషాచలం అడవుల నుండి.. ఎర్రచందనమే కాదు..
- ఏనుగు దంతాల స్మగ్లింగ్ బయట పెట్టిన తెలంగాణ పోలీసులు
- అడవుల పర్యవేక్షణలో అధికారుల నిర్లక్ష్యం ఉందా?
- జంతువుల వేటతోపాటు.. ఏనుగుల వేట ..?

'పుష్ప'లే కాదు.. వీరప్పన్‌లు కూడా..?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



శేషాచలం అడవులు. జీవవైవిద్యానికి, ఎన్నో ఔషధ మొక్కలకు, వన్యప్రాణులకు ముఖ్యంగా ప్రపంచంలో ఎక్కడా లేని ఎర్రచందనం చెట్ల ఎదుగుదలకు అనువైన ప్రాంతం. ఈ ప్రాంతం నుండి గడిచిన దశాబ్దాలుగా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ శేషాచలం అడవులను నిత్యం వార్తల్లో నిలుపుతున్నారు స్మగ్లర్లు. మరోవైపు స్మగ్లర్లను చాకచక్యంగా పట్టుకుంటూ వారిని కోర్టు బోనులో నిలబెట్టి తగిన సాక్ష్యాధారులతో కటకటాల వెనక్కు పంపుతున్నారు టాస్క్ ఫోర్స్, అటవీ శాఖ అధికారులు. మరోవైపు అటవీ సరిహద్దు ప్రాంతాల్లో పంట పొలాలను నాశనం చేస్తున్నాయి అంటూ అడవి పందులను, ఇతర వన్యప్రాణులను విద్యుత్తు కంచె ఏర్పాటు చేస్తుండటంతో ఆ జీవాలకు సంబంధించిన సంఖ్య నానాటికి తగ్గిపోతుంది. ఇప్పటికే అరుదైన జాతిలో చేర్చబడిన నల్లబిల్లీ, కొండ గొర్రె లాంటివి అంతరించి పోతున్నాయి. రిజర్వు ఫారెస్ట్‌లో అనుమతి లేని ప్రదేశాలలో దొంగచాటుగా ప్రవేశించి వేట నిమిత్తం సంచరించే వన్యప్రాణులకు ఉచ్చులు వేస్తూ, బాణాలతో వాటిని వేటాడి ఆ మాంసాన్ని విక్రయించడం పరిపాటిగా మారిపోయింది.

సాధారణంగా గమనిస్తే..

వేట మాంసం ప్రస్తుతం సిండికేట్ ధరల ప్రకారం రూ.860 రూపాయలు మార్కెట్లో పలుకుతోంది. అదే అడవులలో వన్యప్రాణుల మాంసాన్ని అతి రహస్యంగా వేటాడిన మరుక్షణమే మరణించిన ఆ వన్యప్రాణి ఫోటోలు తీసి వేటగాళ్లు ఎవరైతే వన్యప్రాణి మాంసాన్ని కొనుగోలు చేస్తూ ఉంటారో వారికి పంపుతారు. అటు తరువాత మాంసాన్ని కట్ చేసి రహస్యంగా విక్రయాలు జరుపుతున్నారు. అడవులలో వేట నిషిద్ధం అని తెలిసినా.. వేట కొనసాగించే వారిపై ప్రత్యేకంగా అటవీ శాఖ విభాగంలో ఉన్న యాంటీ పోచింగ్ వారు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో అడవుల్లో వేటగాళ్ల ఆట మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.

టాస్క్ ఫోర్స్, అటవీశాఖ విధులలో భాగంగా..

శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా అడ్డుకోవడానికి, పూర్తిస్థాయిలో నియంత్రించడానికి 2014లో అప్పటి ప్రభుత్వం ఎర్రచందనం అక్రమ రవాణాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయడానికి మూడు విభాగాలతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసింది. టాస్క్ ఫోర్స్ ఏర్పాటు తర్వాత శేషాచలం అడవులలో విచ్చలవిడిగా సాగుతున్న ఎర్రచందనం స్మగ్లింగ్‌ను కట్టడి చేయడానికి అప్పటి టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మాగంటి కాంతారావు తనదైన శైలిలో వ్యూహాలను రచించి, ఎర్రచందనం స్మగ్లింగ్‌ను తగ్గించడానికి కృషి చేశారు. ఇంతే కాక, తమిళనాడు రాష్ట్రం జవ్వాది మలై ప్రాంతానికి వెళ్లి మలయాలి ట్రైబల్స్ అత్యధికంగా శేషాచలం అడవులకు స్మగ్లింగ్ కోసం వస్తున్నారని తెలుసుకొని వారిలో పరివర్తన రావాలని ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తే ఎటువంటి శిక్షలు పడతాయో వారి కుటుంబ సభ్యులకు మౌఖికంగా, లఘు చిత్రాల ద్వారా ప్రత్యేకమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. అప్పట్లో ఆ ప్రయత్నాలు ఫలితాలు ఇచ్చినా, మళ్లీ యధావిధిగా స్మగ్లింగ్ జరుగుతుందన్నది వాస్తవం. అటవీ శాఖ పరిధిలో అధికారులు ఆయా ఫారెస్ట్ బీట్లు, సెక్షన్లలో తమ సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు అటవీ పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే అటవీ సరిహద్దు ప్రాంతాల గ్రామాలలో ఈ వన్యప్రాణులు వేట అనేది ఎక్కువగా సాగుతోంది. ఎప్పటికప్పుడు ఆయా సెక్షన్లకు సంబంధించిన అధికారులకు జిల్లా అధికారులతో సూచనలు ఇవ్వడం, పరిపాటిగా వాటిని విని ఆచరించకపోవడం కొనసాగుతూనే ఉంది.

ఎర్రచందనం స్మగ్లింగ్ మాత్రమే కాక..

శేషాచలం అడవుల నుండి వేట మాంసం విక్రయంతో పాటుగా రైతులను ఇటీవల ఏనుగులు భయపెట్టిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమై గజదాడుల నుండి రైతులను, వారి పంట పొలాలను రక్షించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటూ కర్ణాటక రాష్ట్రం నుండి కుంకి ఏనుగులను కూడా తెప్పించింది. అయితే బుధవారం తెలంగాణ పోలీసులకు శేషాచలం అడవుల నుండి ఏనుగు దంతాలను స్మగ్లింగ్ చేస్తూ ఉన్న వ్యక్తులు పట్టుబడడంతో ఒక్కసారిగా శేషాచలం అడవులలో ఏమి జరుగుతోందనేది సంచలనం గా మారిన పరిస్థితి. ఇప్పటికే మన తిరుపతి జిల్లా అటవీ శాఖ పరిధిలో ఎన్ని ఏనుగులు ఉన్నాయి? ఎక్కడెక్కడ సంచరిస్తున్నాయి? ఏనుగుల గుంపులను దారి మళ్లించేందుకు అధికారులు లైన్ డిపార్ట్మెంట్‌లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మార్గదర్శకాలు కూడా జారీచేసిన పరిస్థితుల్లో... ఏనుగులను కూడా వేటాడి వాటి దంతాలను కోట్ల రూపాయలకు అమ్ముతూ సరికొత్త స్మగ్లింగ్‌కు తెరలేపారు స్మగ్లర్లు. ఇన్నాళ్లుగా శేషాచలం అడవులలో ఎర్రచందనం అక్రమ రవాణా, వన్యప్రాణుల మాంసం విక్రయాలు మాత్రమేకాక, కొత్తగా ఏనుగు దంతాలను కూడా స్మగ్లింగ్ చేసే ముఠా ఉందని తెలిసి వచ్చింది. ఒకప్పుడు ఏనుగు దంతాలకు, ఎర్రచందనం స్మగ్లింగ్‌కు వీర నాయకుడైన వీరప్పన్, గతంలో ఏనుగు దంతాలను విదేశాలకు ఎగుమతి చేస్తూ డబ్బులు వెనకేశాడని ఆనాటి పరిస్థితులు నేడు మళ్ళీ పునరావృత్తం అయ్యాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. ఏనుగు దంతాలు స్మగ్లింగ్ చేసే ముఠా శేషాచలం అడవులలో ఏ ప్రాంతం నుండి చేస్తున్నారో.. అన్న విషయాలను అటవీశాఖ అధికారులు నివృత్తి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తెలంగాణ పోలీసులకు పట్టుబడిన స్మగ్లర్లు శేషాచలం అడవుల నుండి ఏనుగు దంతాలను తీసుకువచ్చామని, వీటిని రూ.3 కోట్ల రూపాయలకు బేరం పెట్టామని పోలీసుల ముందు చెప్పారని విశ్వసనీయ సమాచారం.

విచారణ చేసి వాస్తవాలను తెలుపుతాం..



శేషాచల అడవుల నుండి ఎర్రచందనం స్మగ్లింగే కాక, ఏనుగు దంతాలను కూడా స్మగ్లింగ్ చేస్తున్నారని వస్తున్న వార్తలపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, ఏ ప్రాంతంలో ఈ ఘటన జరిగిందో విచారణ చేసి వాస్తవాలను తెలుపుతాం. ఇంతే కాకుండా రిజర్వు ఫారెస్ట్ లోకి ఎవరు వచ్చి వెళుతున్నారన్న విషయంపై ఇప్పటికే పూర్తి స్థాయిలో నిఘా ఉంచాము. తెలంగాణలో పట్టుబడిన స్మగ్లర్లు, కేసు వివరాలను తెలుసుకొని సమగ్ర సమాచారాన్ని త్వరలోనే నివేదిస్తాం.

-సెల్వం, తిరుపతి సర్కిల్ సిసిఎఫ్, తిరుపతి జిల్లా

డ్రగ్స్ రహిత జిల్లా కోసం కృషి చేద్దాం



డ్రగ్స్ నివారణ ర్యాలీలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్లు, కమిషనర్ మౌర్య తదితరులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: డ్రగ్స్ రహిత జిల్లా కోసం మనమందరం కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ డా వెంకటేశ్వర్ తెలిపారు.శుక్రవారం మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవం అవగాహన కార్యక్రమాల నిర్వహణ భాగంగా ఆర్డీవో కార్యాలయం నుంచి ఎమ్మార్ పల్లి సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీలో తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, మున్సిపల్ కమిషనర్ మౌర్య, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్. ఉమ, రిజిస్టర్ ప్రొఫెసర్. రజిని, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సి ముని కృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడడం వలన ఆరోగ్యం కూడా క్షీణిస్తుందని, ఇతర నేరాలకు పాల్పడుతూ మహిళల మీద కూడా అనేక విధాలుగా నేరాలు పాల్పడుతున్నారని అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ.. సమాజంలో డ్రగ్స్ అనే మహమ్మారి లేకుండా మనమందరము ఉద్యమం లా కృషి చేయాలని తెలిపారు. అందులో భాగంగా ఈరోజు అవగాహన ర్యాలీని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, ఎస్పీ అందరి చేత డ్రగ్స్ నియంత్రణ ప్రతిజ్ఞ చేయించారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం డ్రగ్స్ మయమయింది

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి) గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రం డ్రగ్స్ ఆంధ్ర ప్రదేశ్ గా తయారైందని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని అన్నారు. గురువారం చంద్రగిరిలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.

జేఈఈ, నీట్ టాపర్లకు కలెక్టర్ అభినందన



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి నారాయణ విద్యాసంస్థలలో చదివి జేఈఈ అడ్వాన్స్, నీట్ పరీక్షలలో జిల్లా నుంచి జాతీయస్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్లు గురువారం అభినందించారు. జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో టాప్ ర్యాంకులు సాధించిన జేఈఈ విద్యార్థులు భానుచరణ్ రెడ్డి 51, మణిదీప్ రెడ్డి 345, హిమేష్ రాఘవ 468, శశాంక్ రెడ్డి 618,యశ్వంత్ 906, నిఖిల్ 1056, నీట్ టాపర్లు జ్ఞానీష 934, మౌనిక, కీర్తి, విశ్వక్ అగర్వాల్‌లు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అత్యుత్తమ ర్యాంకులు సాధించినందుకు వారిని అభినందించి, భవిష్యత్తులో జిల్లాకు, రాష్ట్రానికి వారి సేవలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డిజిఎం కొండల రావు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు డీన్లు, ప్రిన్సిపాల్లు, తదితరులు పాల్గొన్నారు.

దంతక్షయ నివారణకు చిరునామా

'ప్రణు' హాస్పిటల్



ప్రజాశక్తి-తిరుపతి సిటి : సరికొత్త సాంకేతిక పరికరాలతో నాణ్యమైన వైద్యం అందిస్తూ దంతక్షయ నివారణకు 'ప్రణు' డెంటల్ హాస్పిటల్ చిరునామాగా నిలిచిందని ఆ ఆసుపత్రి అధినేత డాక్టరు ప్రసాద్ ప్రతీత్ తెలిపారు. స్థానిక ఓల్డ్ మెటర్నటీ ఆసుపత్రి రోడ్డులోని ప్రణు దంత వైద్యశాలలో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ మనిషి సహజ సిద్దమైన పళ్లను పదిలంగా చూసుకోవడానికి నేడు కొన్ని పద్దతులను తప్పక పాటించాలన్నారు. నేడు పళ్ల అమరికలో నూతన టెక్నాలజీతో శాశ్వత అమరికలు చేయొచ్చన్నారు. కృత్రిమ దంతాలు అమరిక ఈనాటిది కాదనీ, ద్వాపర యుగంలోనూ, మహాభారత సమయంలో శ్రీకృష్ణుడికి కర్ణుడు బంగారు పన్ను చేయించారని పురాణాలు చెబుతున్నాయన్నారు. క్లిప్‌ల స్థానంలో నేడు అనేక మార్పులు సంతరించుకుంటూ పింగాణి పళ్లను అమర్చే స్థాయికి ఎదిగామన్నారు.

సిబిసిటి విధానం ద్వారా...

సిబిసిటి విధానం ద్వారా రోగి దవడ ఎముకలు నిర్మాణాన్ని ఎక్స్‌రే తీసి పూర్థిస్థాయిలో అంచనా వేసుకుని, తదనుగుణంగా ఇమ్‌ప్లాంట్‌ను అమర్చుతున్నామన్నారు. అమర్చిన ఇమ్‌ప్లాంట్‌పైన కృత్రిమ దంతాల ఏర్పాటుకు కాడ్ క్యామ విధానం, 3డి ప్రింటింగ్, 3డి మిల్లింగ్ లేజర్ విధానాల ద్వారా లోపాలు లేని దంతాలను తయారు చేస్తున్నామన్నారు. దంత వైద్యంలో రూట్ కెనాల్ ట్రిట్‌మెంట్ విధానంలో ఉపయోగించే పరికరాల్లో గొప్ప మార్పులు సంతరించుకున్నాయని తెలిపారు. ఎత్తు పళ్లను సరిచేయడంలో నోటిలో క్లిప్‌ల అవసరం లేకుండా క్లీన్ డ్లైజర్స్ విధానం ద్వారా రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చికిత్సను చేసి, పళ్ల వరుసను సరిచేస్తున్నామన్నారు.

డెఫ్లోరిన్ పద్దతి ద్వారా..

పళ్ల పరుసపై గారలు కడుతాయి. ముఖ్యంగా నీటిలో ఫ్లోరిన్ శాతం అధికంగా ఉండే అనంతపురం, నల్గొండ వంటి ప్రాంతాల్లో ప్రజలు ఈ సమస్యలు ఎక్కువుగా ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్యల పరిష్కారం కోసం డెఫ్లోరిన్ పద్దతి ద్వారా నివారించవచ్చన్నారు. తమ ప్రణు దంత వైద్యశాలలో అనేక దంత సమస్యలు పరిష్కారం దొరుకుతుందన్నారు. సరికొత్త సాంకేతిక పరికరాలతో, అత్యాధునిక వైద్య పద్దతిలో నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందిస్తున్నామన్నారు. అతి తక్కువ ఫీజులతో, అందరికి అందుబాటులో దంత వైద్యం లభిస్తుందన్నారు. వివరాలకు 900160 981 ఫోన్ నెంబరను సంప్రదించాలని కోరారు.

స్విమ్స్ కార్మికుల


రిలే నిరాహార దీక్షలు ప్రారంభం



కార్మికుల నిరసన దీక్షను ప్రారంభిస్తున్న సిఐటియు నాయకులు కందారపు మురళి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: స్విమ్స్ యాజమాన్యం కార్మికుల పట్ల అనుసరిస్తున్న మొండి వైఖరి విడనాడి సమస్యలు పరిష్కరించాలని, గత రెండున్నర ఏళ్లుగా అధికారులకు విన్నవించినా, పరిష్కారం కాని నేపథ్యంలో గురువారం సిమ్స్ క్యాజువాలిటీ ఎదురుగా కార్మికులు నిరసన దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరసన దీక్షలో కూర్చున్న యూనియన్ నాయకులు రవి, సూరి, వెంకటేష్, సుబ్రహ్మణ్యం, వెంకటేష్, కోటయ్య, బాలకృష్ణ నాయకులకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పూలమాలవేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా కందారపు మురళి, స్విమ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి మాధవ్ కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. స్విమ్స్ యాజమాన్యం తమ పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికీ నిరసనగా రిలే నిరాహార దీక్షలు జరుగుతున్నాయని 28వ తేదీ డీసీఎల్ కార్యాలయంలో జరిగే చర్చలు సఫలం కాకపోతే 30వ తేదీ నుండి నిరవధిక సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు. సమ్మె నోటీస్ ఇచ్చిన 14 రోజుల తర్వాత ఏ క్షణంలోనైనా కార్మికుల సమ్మె చేసే హక్కు ఉన్నప్పటికీ స్విమ్స్ ఆసుపత్రికి రోజు వందలాదిమంది రోగులు వస్తున్న నేపథ్యంలో, మానవత్వంతో కార్మికులు చర్చల ద్వారానే సమస్యలు పరిష్కరించుకుందామని, సమ్మెను వారం రోజులు వాయిదా వేయడం జరిగింది. అయినా యాజమాన్యం తన మొండి వైఖరి ప్రదర్శించడంతో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించామన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి కార్మికులు పెట్టిన తొమ్మిది డిమాండ్లను బేషరతుగా అంగీకరించి అమలు చేయాలని లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహానికి యాజమాన్యం బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ముందస్తుగానే రేషన్



వృద్ధులకు రేషన్ పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-ఏర్పేడు: 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ముందస్తుగానే రేషన్ ఇవ్వాలని ఏపీ ప్రభుత్వ ప్రకటించడంతో ఏర్పేడు మండలంలో పలు రేషన్ దుకాణాలలో జూలై నెల రేషన్‌ను జూన్ 26 నుండే ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పలుచోట్ల రేషన్ డీలర్లు అర్హులకి డోర్ డెలివరీ చేయనున్నారు.

మండల స్థాయి పీజీఆర్ఎస్‌కు

నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మండల స్థాయి పీజిఆర్ఎస్ కు నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలని రాష్ట్ర భూ పరిపాలన చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తో కలిసి పిజిఆర్ఎస్, 22ఏ, హౌసింగ్ ఫర్ ఆల్, జీవో నెంబర్ 30, రీసర్వే, తదితర రెవెన్యూ సంబంధిత అంశాలపై మండల, డివిజన్, జిల్లాస్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. మండల స్థాయిలో నిర్వహించే పిజిఆర్ఎస్‌కు నోడల్ అధికారులను నియమించాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. వారు ప్రతి సోమవారం మండలానికి వెళ్లి అక్కడ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించాలన్నారు. సోమవారం మధ్యాహ్నం సంబంధిత తహశీల్దారులు వారి సిబ్బందితో కూర్చుని ఆరోజు వచ్చిన పిటిషన్లలో ఆర్ఐ, మండల సర్వేయర్లకు సంబంధించిన పిటిషన్లను అందజేయాలన్నారు. వారు ఆ పిటిషన్లపై వారం లోపు నివేదికలు ఇవ్వాలన్నారు. ప్రతి సోమవారం జరిగే సమావేశానికి సంబంధించిన మినిట్స్ రికార్డ్ చేసుకుని ఉంచుకోవాలని, ఒక ప్రతిని ఆర్డీవోకి పంపాలన్నారు. అనంతరం వారి కార్యాలయాలకు తనిఖీ నిమిత్తం విచ్చేసే ఉన్నతాధికారులకు ఆ మినిట్స్ ప్రతులను చూపించాలన్నారు. జిల్లా కలెక్టర్ నుండి థర్డ్ పార్టీతో ఆడిట్ చేసి ఎండార్స్ మెంట్లో గుర్తించిన తప్పిదాలను సరిచేయాలని తహశీల్దార్లకు పంపడం జరుగుతుందన్నారు. ఆ తప్పిదాలను మండల తహశీల్దారులు సరిచేయాలని, అదే తప్పు మరొక మారు పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. అలా కాకుండా మరలా అలాంటి తప్పులే చేస్తే వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు సూచించారు. ఈ అంశంలో ఇప్పటికే ఆరు నెలల సమయం ఇచ్చామని, పిజిఆర్ఎస్ సిస్టంలో మోడిఫికేషన్ చేయడం జరిగిందని, రాష్ట్రస్థాయి నుండి కొన్ని సూచనలు కూడా జారీ చేయడం జరిగిందన్నారు. మరొక నెలలోపు పిజిఆర్ అంశంపై అందరూఅవగాహన పెంచుకోవాలని సూచించారు. తప్పులు చేస్తే ఇకపై సహించేది లేదని అలాంటి తహసీల్దారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడానికి వెనుకాడమన్నారు. మ్యుటేషన్లకు సంబంధించిన ప్రక్రియ, కుల ధ్రువీకరణ జారీ లాంటి చట్టపరమైన అంశాల్లో ఎలాంటి తప్పిదాలకు తావివ్వరాదన్నారు. వెబ్ ల్యాండ్ సంబంధించి ఏ ఎంట్రీ అయినా నమోదు చేసేటప్పుడు వీఆర్వో అప్లోడ్ చేసే డాక్యుమెంట్‌ను తప్పనిసరిగా పరిశీలించాలని, ఎటువంటి పరిస్థితుల్లో పరిశీలించకుండా సంతకం చేయరాదని హెచ్చరించారు. అలాగే వారు విచారణకు సంబంధం లేని వాటిని ఏదైనా అప్లోడ్ చేస్తున్నారా, అలాంటివి ఏమైనా గుర్తించారా అని అధికారులను ప్రశ్నించారు. తహసిల్దారుగా మ్యుటేషన్ ప్రక్రియకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసే సమయంలో ఈ సేవా ద్వారా చేయాలని, ఆ తర్వాత వీఆర్వో నివేదిక పరిశీలించాలని అనంతరం క్లిక్ చేసి ఓపెన్ చేసి డాక్యుమెంట్ అప్లోడ్ చేశారా?లేదా?చూడాలన్నారు. అందులో ఆర్ఐ ఏమి సిఫారసు చేశారో పరిశీలించి ఆ తర్వాత సంబంధిత తహసిల్దార్లు ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. ఆ తర్వాత వాటిని అప్లోడ్ చేయాలన్నారు. రెండు, మూడు రోజుల్లో ఇందుకు సంబంధించిన టెంప్లేట్లను పంపడం జరుగుతుందన్నారు.వాటిని రెవెన్యూ అధికారులకు పంపుతామని అందులో పారిట్రషన్, సేల్‌లకు సంబంధించి ఆటోమేటిక్ గా ఉత్తర్వులు వస్తాయన్నారు. కేవలం స్పీకింగ్ పార్ట్ మాత్రమే అందులో టైప్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మీరు చట్టపరమైన బాధ్యతను నిర్వహిస్తున్నారన్న అంశాన్ని గమనంలో ఉంచుకోవాలన్నారు. తిరుపతి అతి సున్నితమైన జిల్లా అని గత ఒక సంవత్సర కాలంలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న సమస్యలను పరిష్కరించామన్నారు. సాధారణ మానవుని సమస్యలను కూడా పరిష్కరించడం జరిగిందని పేర్కొన్నారు. జిల్లాలో ఎలాంటి శాంతి భద్రత పరమైన సమస్యలు లేవని ,అలాగే రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేయడం తదితర సమస్యలు కూడా లేవన్నారు. భూ పరిపాలన చీఫ్ కమిషనర్ సూచించిన అంశాలన్నిటిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అనంతరం జిల్లా కలెక్టర్ రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్ కు వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిమను అందజేశారు.లిఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డిఆర్ఓ నరసింహులు, తిరుపతి ,శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీవోలు బి రామమోహన్, ఎం. భాను ప్రకాష్ రెడ్డి, ఈ.కిరణ్మయి సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్సుఅసిస్టెంట్ డైరెక్టర్ అరుణ్ కుమార్, కలెక్టరేట్ లోని వివిధ విభాగాలకు చెందిన సెక్షన్ హెడ్సు,డిప్యూటీ కలెక్టర్లు, సిబ్బంది జిల్లాలోని తహసీల్దారులు, మండల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

నూతన వైద్యాధికారిగా ఉదయ్ కుమార్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన వైద్యాధికారిగా గురువారం ఉదయ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఉదయ్ కుమార్ గతంలో వరదయ్యపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య అధికారిగా పనిచేస్తూ బదిలీపై బుచ్చినాయుడు కండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చారు. బుచ్చినాయుడు కండ్రిగలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న మాధవి లత ఆమె సొంత జిల్లా కడపకు బదిలీ అయ్యారు. ఇద్దరు వైద్యాధికారులు బుచ్చినాయుడు కండ్రిగ ఆరోగ్య కేంద్రానికి ఉండాల్సి ఉండగా ఒకరు మహిళా వైద్యాధికారి ఉంటే మండల మహిళల ఆరోగ్య సమస్యలను చూసేందుకు సౌకర్యంగా ఉంటుందని ప్రజలు ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే పాశం ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. గూడూరు పట్టణ, పరిసర ప్రాంత గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యేకి తెలియజేశారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి ఎమ్మెల్యే పరిష్కరించారు. ఈ గ్రీవెన్స్ డే లో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు.

పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఉదయం నూతనంగా వచ్చిన పంచాయతీ కార్యదర్శులను బాధ్యతలు స్వీకరించిన 18 మందితో ఎంపీడీవో వెంకటరత్నమ్మ ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో శానిటేషన్, ఐవిఆర్ఎస్ కాల్స్, ఎస్ డబ్ల్యు పిసి షెడ్ల నిర్వహణ పిజిఆర్ఎస్‌పై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బొజ్జా తారకం జయంతి సభ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: దళితులు, ఆదివాసీ ఇతర పేద వర్గాల హక్కుల కోసం పోరాటాలు చేసిన న్యాయ కోవిదుడు బొజ్జా తారకం జయంతి సభ శుక్రవారం తిరుపతి ఎం.ఆర్. పల్లి ఆర్పిఐ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ సభ ప్రముఖ రచయిత, గొడుగుచింత గోవిందయ్య అధ్యక్షతన రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగనుందని నిర్వాహకులు తెలిపారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం మధ్యాహ్నం తన కార్యాలయంలో అందించారు. కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన జ్యోతి అనారోగ్యంతో చికిత్స చేయించుకోగా సిఎం సహాయ నిధి నుంచి లక్షా డెబ్బైఐదు వేల రూపాయల చెక్కు రాగా ఆమె నడవలేని పరిస్థితి ఉండటంతో ఆమె కుమారుడు ఎమ్మెల్యే నుంచి చెక్ అందుకున్నారు. అలాగే మూడవ డివిజన్ లోని గరుడాద్రినగర్‌కు చెందిన క్లైవ్ హరినాథ్ ఆచార్యకి నలభై ఒక్కవేల ఎనభై నాలుగు రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందించారు. 17వ డివిజన్ పరిధిలోని కొత్తపల్లెకు చెందిన శ్రీ. చెంగల్రాయులుకు లక్షా డెబ్బైరెండు వేల నలభై ఎనిమిది రూపాయల చెక్కును ఎమ్మెల్యే అందించారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం: గురువారం తిరుపతి రూరల్ మండల పరిధి, తనపల్లి రఘునాథ్ రిసార్ట్‌లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తిరుపతి, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం మండలాలకు సంబంధించిన పలువురికి సిఎంఆర్ఎఫ్ సహాయ నిధి ద్వారా సుమారు 39 లక్షల 2వేల 291 రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. సిఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు పంపిణీ చేశారు.

కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టండి

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతిలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుండి లక్ష రూపాయల్లో ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్‌కు బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నారాయణ గౌడ్ గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నారాయణ గౌడ్ మాట్లాడుతూ అధిక ఫీజులు దోపిడీ పాల్పడుతున్న పాఠశాలలను గుర్తించి మూసివేయాలని కోరారు. వీరి వెంట బీసీ విద్యార్థి జిల్లా నాయకులు పవన్ కుమార్ యాదవ్ ఉన్నారు.

నాలుగవ రోజూ సమ్మె

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మునిసిపాలిటీలోని ఇంజనీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె నాలుగవ రోజూ కొనసాగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గిరీష్ కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగం అవుట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - నాయుడుపేట: కేంద్ర ప్రభుత్వం కార్మికులను ... చేసేందుకు తెచ్చిన బిల్లులకు వ్యతిరేకంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. నాయుడుపేట కామ్రేడ్ వేదనపల్లి సుందర్ రామిరెడ్డి భవన్, సిఐటియు కార్యాలయంలో గురువారం నాయుడుపేట సిఐటియు మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు లక్ష్మి ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులు, సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.మహేష్ బాబు, కార్యదర్శి ఎస్.ముకుంద తదితరులు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ పరిశోధన కేంద్రంలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : వ్యవసాయంలో సవాళ్లు - వాతావరణ అనుకూలిత నూతన ఆవిష్కరణలు అను అంశంపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం తిరుపతి నందు జాతీయ సదస్సును రేపటినుండి రెండు రోజులపాటు(27-28, జూన్ 2025) ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రానమీ ఆంధ్రప్రదేశ్ చాప్టర్, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి.సుమతి తెలిపారు. ఈ సదస్సుకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని సేద్య విభాగపు శాస్త్రవేత్తలు, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొంటారని వివరించారు.

వాసుదేవ రాజు కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - చిత్తూరు: పిచ్చాటూరు మండలం, కీలపూడి గ్రామంలో రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి జి.వాసుదేవ రాజు అనారోగ్యంతో ఈ నెల 22న మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం కీలపూడిలోని వాసుదేవ రాజు ఇంటికి చేరుకొని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

శ్రీనివాసంలో కార్మికులకు వైద్య శిబిరం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: నగరంలోని స్థానిక ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలోని, టీటీడీకి చెందిన శ్రీనివాసం కాంప్లెక్స్ లో పనిచేసే కార్మికులకు గురువారం తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అక్కడ పనిచేసే ఈఎస్ఐ లబ్ధిదారులైన ఉద్యోగులకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి తదుపరి పరీక్షల కోసం ఆసుపత్రికి రావాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో ఈఎస్ఐ డాక్టర్లు ఎస్. ధనుంజయ రెడ్డి, వి.మృణాలిని, హెడ్ నర్స్ జి.అనసూయమ్మ, వైద్య సిబ్బంది పి.హేమలత, పి.శ్రీకాంత్, నరసింహులు, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

బుగ్గిపాలైన బతుకులకు భరోసా ఏదీ..?

- రెండేళ్ల క్రితం బాణా సంచా తయారీ కేంద్రంలో ఘోర ప్రమాదం
- కార్మికుల మృతితో వీధిన పడ్డ కుటుంబాలు
- అధికారులు, నేతలు ఇచ్చిన హామీలు లుపుకోవాలి



కాలిపోయిన బాణా సంచా కేంద్రం, బుగ్గి పాలైన బతుకులు





అధికారుల, నాయకుల కంటి తుడుపు చర్యలు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: మండల పరిధిలోని బాణా సంచా తయారీ కేంద్రంలో రెండు సంవత్సరాల క్రింతం భారీ పేలుడు జరుగడంతో నలుగురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అధికారులు ప్రజాప్రతినిధులు రెండు రోజులపాటు ఈ ప్రాంతంలోనే ఉండి తెగ హడావిడి చేసి మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి ఐదు లక్షలు చొప్పున ప్రభుత్వం నుండి నష్టపరిహారం కింద చెక్కులను పంపిణీ చశారు. పవన్ కళ్యాణ్ అనే యువకుడు వాలంటరీగా విధులు నిర్వహిస్తూ కుటుంబ పోషణకు డబ్బులు సరిపోక బాణాసంచా తయారీ కేంద్రంలో పార్ట్ టైం ఉద్యోగం చేసుకునేవాడు. ఈ క్రమంలో ప్రమాదం జరగడంతో అతను మృత్యు వాతపడ్డాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈ ప్రమాదంలోనే మృతి చెందిన నాగేంద్ర కథ మరోలా ఉంది. మృతుడికి అప్పటికే ఇద్దరు ఆడపిల్లలు ఉండగా ప్రమాద సమయంలో అతని భార్య డెలివరీ నిమిత్తం ఆసుపత్రులో చేరింది. తాను మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ సమయంలో ఎమ్మెల్యే నాగేంద్ర భార్యకు అంగన్వాడి ఉద్యోగం వచ్చేలా అధికారులకు ఆదేశాలు ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ రెండు సంవత్సరాలు గడచినా.. ఇప్పటివరకు ఎటువంటి ఉద్యోగం రాకపోగా నష్టపరిహారం కింద లక్షలు వచ్చాయి కదా ఇంకా ఏమి కావాలి అని స్థానిక ప్రజాప్రతినిధులు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిర్భయంగా తిరుగుతున్న నిందితుడు

దాదాపు నలుగురు మృతి చెందడానికి కారణమైన బాణాసంచా తయారీ కేంద్ర నిర్వాహకుడు వీర రాఘవులు ఈ ప్రమాదంలో తానకూ కొంత గాయాలు పాయలు కాగా హుటాహుటిన ఆసుపత్రిలో చేరి ఆ సమయంలో కొంత హై డ్రామా సృష్టించి ప్రజాగ్రహానికి గురికాకుండా తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఇది ఇలా ఉండగా గడిచిన రెండు సంవత్సరాల నుండి బాధితులకు ఎటువంటి నష్టపరిహారం అందించకుండా కాలయాపన చేస్తూ నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నాడు. పైగా ఇంతటి సంఘటన జరగడానికి ముఖ్య కారణమైన యజమానిపై అధికారులు కేసు నమోదు చేసి నిమ్మకుండిపోయారు. సరైన అనుమతులు లేకుండా బాణ సంచా తయారీ కేంద్రాన్ని ఎలా నిర్వహిస్తారని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు? పైగా మామూళ్ల మత్తులో అధికారులు ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్నారని ఇలాంటి వారిని కఠినంగా శిక్షించకపోతే ఇలానే మరి కొంతమంది ఇలాంటి ప్రమాదాలకు బలయ్యే అవకాశం ఉందని తెలుపుతున్నారు.

ఇచ్చిన హామీలు ఏమైనట్లు ..?

అధికారులు, ప్రజాప్రతినిధులు సంఘటన జరిగిన సమయంలో ప్రజా ఆగ్రహానికి గురికాకుండా ఉంటానికి ఆ సమయానికి నోటికి వచ్చిన హామీలు ఇచ్చేసి వెళ్లిపోతున్నారు తప్ప, బాధితులకు ఎటువంటి న్యాయం చేసే ప్రయత్నం చేయడం లేదని ఇందుకు ఉదాహరణ ఈ బాణాసంచా తయారీ కేంద్రం వద్ద ప్రాణాలు పోగొట్టుకున్న నలుగురు కుటుంబాలు రోడ్డున పడిన ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి గానీ ప్రజా ప్రతినిధి గానీ వారికి సహకారం అందించకపోవడమే. మృతుల కుటుంబాలకు సరైన న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు

మృతుల కుటుంబాలలో ఒకరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి



సిపిఎం నాయకులు దాసరి జనార్ధన్

ఇంత ఘోర సంఘటన జరిగి రెండు సంవత్సరాలు అవుతున్న ఇప్పటికీ బాధితులకు న్యాయం జరగకపోవడం దౌర్భాగ్యం అని సిపిఎం సత్యవేడు డివిజన్ కర్యదర్శి దాసరి జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారికి ప్రభుత్వం తరపున అదనంగా బీమా సదుపాయం కల్పించి మరింత ఆర్థిక సహాయం అందించాల్సింది పోయి రెండు సంవత్సరాలుగా భీమా డబ్బులు కూడా అందకుండా తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్న అధికారులను శిక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రమాదం జరిగినప్పుడు ప్రజల దృష్టి మళ్లించడానికి ప్రజా ప్రతినిధులు లేనిపోని హామీలు ఇచ్చి ప్రజల దృష్టి మళ్లిస్తున్నారు తప్ప నిజంగా బాధిత కుటుంబాలకు అండగా నిలవాల్సిన స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దారుణం. బాణాసంచా తయారీ కేంద్రంలో మృతిచెందిన నిరుపేదలైన ఎల్లకట్టవా బాధిత కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అధికారులను ఆది ఆదేశించి బుగ్గిపాలైన పేదల కటుంబాలను ఆదుకోవాలి.

చెంచు కుమార్‌కి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్ : గత సంవత్సరం జాతరలో జరిగిన లాఠీ చార్జీ కారణంగా తీవ్రంగా గాయపడి, నష్టపోయిన చెంచు కుమార్‌కి న్యాయం చేయాలని, రెండు ఎకరాల భూమి, ఉద్యోగం ఇప్పించాలని కోరుతూ గురువారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద దళిత సంఘాలు, గిరిజన సంఘాలు, వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం వెంకటగిరి నియోజకవర్గ కన్వీనర్ వడ్డిపల్లి చెంగయ్య, ఎమ్మార్పీఎస్ వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ పల్లిపాటి రవిలు మాట్లాడుతూ పోయిన జాతరలో చెంచు కుమార్ అనే దళితుడు పీపా ఊదినందుకు పోలీసులు లాటిచార్జ్ చేయడం జరిగిందన్నారు. తీవ్రంగా గాయపడిన దళితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆ మరుసటి రోజు దళిత సంఘాలు, వామపక్ష పార్టీలు వెంకటగిరిలో ఆందోళన చేపట్టాయన్నారు. జిల్లా ఏఎస్పీ , జోక్యం చేసుకొని న్యాయం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజుకి తెలపడం జరిగిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎంవీ రమణ, తహశీల్దార్‌లు కలిసి దళితుడికి రెండు ఎకరాల భూమి, అవుట్సోర్సింగ్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పారన్నారు. ఎమ్మెల్యే హాస్పిటల్ ఖర్చులకు 50 వేల రూపాయలు ఇచ్చారని తెలిపారు. కానీ 8 నెలలు పూర్తవుతున్నా దళితుడికి తహశీల్దారు భూమి చూపించకపోవడం అన్యాయమన్నారు. దళిత సంఘాలు, గిరిజన సంఘాలు, వామపక్షాల ఆధ్వర్యంలో దళితుడికి న్యాయం చేయాలని, తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్, కెవిపిఎస్, మహిళా సంఘం (ఐద్వా) సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం, గిరిజన సంఘం, తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ వెలుగు కార్యాలయంలో గురువారం ఉదయం మండల మహిళా సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఏపియం మునెయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ పెన్యూర్ లక్ష్యంలో భాగంగా మహిళా సంఘాల సభ్యుల్లో వివిధ రకాల వ్యాపారాలు చేయడానికి ఆసక్తి, అర్హత కలిగిన వారికి పిఎంఈజిపి, పిఎంఎఫ్ఎంఈ తో పాటు సిఐఎఫ్, ఉన్నతి, స్త్రీ నిధి ద్వారా వార్షిక ఋణ ప్రణాళికలో సభ్యులు కోరిన మేరకు ఆర్థిక సాయం పొంది మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని తెలియ జేసారు. డైరీ ఏపీయం రేవతి మాట్లాడుతూ మన మహిళా సంఘాలు సభ్యులు ఆవులు, గేదెల పాలు మన పాల సెంటర్ కే పోయడం ద్వారా గిట్టు బాటు ధర పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో సీసీలు వెంకటరత్నం, వీరజిన్నప్ప, అకౌంటెంట్ హిమగిరిజ, మండల సమాఖ్య లీడర్లు శ్వేత, భారతి, లావణ్య, గ్రామ సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి ఇందిరా మైదానంలో 6వ తేదీన జరగనున్న బీసీ ఆత్మగౌరవ భరోసా సభ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చ నున్నదని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. జూలై 6వ తేదీ తిరుపతిలో జరగనున్న ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయడానికి గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ కాలనీ పూలే విగ్రహం వద్ద పూల విగ్రహానికి ఘన నివాళులర్పించి చైతన్య ప్రచార రథాలను ప్రారంభించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీల కుల పెద్దలు అన్ని వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రెటీనా పెయింట్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయశ్రీ

ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట, ఏఎల్‌సిఎం గ్రౌండ్ ఎదురుగా నాయుడుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ కుమారుడు నూతనంగా ఏర్పాటు చేసిన రెటీనా పెయింట్స్ లిమిటెడ్ షాపును గురువారం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వంత కాళ్లపై నిలబడేందుకు వ్యాపారాలు వైపు మొగ్గు చూపడం అభినందనీయమన్నారు. రఫీ కుమారుడు షేక్ మజీద్ ఏర్పాటు చేసిన రెటీనా పెయింట్స్ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా షేక్ రఫీ ఆయన కుమారుడు షేక్ మజీద్‌తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంల తోపాటు పలువురు నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, మాజీ ఏఎంసి చైర్మన్ శిరసనం భేటీ విజయ భాస్కర్ రెడ్డి, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, టీడీపీ నాయకులు నెలవల రాజేష్, పలు కూరు ముత్యాలయ్య, చక్రపాణి, బల్లి ముత్యాలయ్య, మొండెం బాబు పాల్గొన్నారు.

ఎమ్మెస్ సుగర్వాల్ యాజమాన్యంపై జడ్జికి వినతి

ప్రజాశక్తి - నాయుడుపేట: కార్మికుల ప్రాణాలకు రక్షణ లేకుండా వారితో వెట్టి చాకిరి చేయిస్తూ వారి ప్రాణాలను బలి గొంటున్న పెళ్లకూరు మండలం పెన్నేపల్లిలోని ఎమ్మెస్ అగర్వాల్ కంపెనీ యాజమాన్యంపై చర్యలు చేపట్టి కార్మికులకు న్యాయం చేయాలని నాయుడుపేట జడ్జి పి.మీనాక్షి సుందరికి సిఐటియు నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు శివకవి ముకుంద మాట్లాడుతూ ఎమ్మెస్ అగర్వాల్ పరిశ్రమలో యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా ఇప్పటి వరకు జరిగిన పలు ప్రమాదాలలో ఎన్నో ప్రాణాలు పోయాయన్నారు. ఈ నెల 24వ తేదీన పరిశ్రమలో బాయిలర్ వద్ద పనిచేస్తున్న వలస కార్మికుడు బాయిలర్ సెగతో బాడీ మొత్తం ఉడికిపోవడంతో ఆ కార్మికని చెన్నై హాస్పిటల్‌కి తరలించారన్నారు. విధుల్లో ఉన్న కార్మికులు ఈ సంవత్సరంలో ముగ్గురు మరణించారని, తరచూ ప్రమాదాలు జరుగుతూ ఉన్న ఆ పరిశ్రమ యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ భద్రత చర్యలు చేపట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు సేఫ్టీ పరికరాలు ఇచ్చి కార్మికులతో పని చేపించుకోవాలని లేనిపక్షంలో పరిశ్రమల యాజమాన్యంపై సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేపడతామని తెలిపారు.

భరతనాట్యంలో లింగ వివక్ష, అసమానతలపై అవగాహన

ప్రజాశక్తి - క్యాంపస్ : సంగీత, నృత్య, లలిత కళల విభాగంలో రాష్ట్రీయ ఉన్నత విద్యాభియాన్ ప్రాజెక్టు కింద "భరతనాట్యంలో లింగ వివక్ష, అసమానతలు" అనే శీర్షికతో లింగ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ యు.హిమబిందు ఈ కార్యక్రమం లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ప్రొఫెసర్ ఆర్.ఎన్.ఎస్. శైలేశ్వరి, ప్రొఫెసర్ ఎన్.హరిపద్మరాణి, ఇతర అధ్యాపకులు, పరిశోధకులూ, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీలో సమాచార హక్కు చట్టం అమలు చేయాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీలో సమాచారకు చట్టాన్ని అమలు చేయాలని ఆర్ పి ఐ, టీటీడీ ఎంప్లాయిస్, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, జాతీయ సమాచార హక్కు చట్టం సభ్యులు హిరాలాల్ సమయ్‌కు వినతి పత్రం అందజేశారు. తిరుపతి పద్మావతి అతిథి గృహంలో గురువారం ఆయనను కలిసిన పలు సంఘాల నాయకులు మాట్లాడుతూ టీటీడీ మఠాధిపతి, మఠాధి పరిధి నుండి రాజ్యాంగ పరిధిలోకి వచ్చి 80 సంవత్సరాలు అయిందన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ స్థాయి అధికారి పర్యవేక్షణలో టీటీడీలో పరిపాలన కొనసాగుతున్నదని తెలిపారు. అయితే రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన సమాచార హక్కు చట్టం 2005 టీటీడీలో అమలుకు నోచుకోకపోవడం పౌరులు రాజ్యాంగం కల్పించిన హక్కును కోల్పోవడమే అన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జాతీయ సభ్యులు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా అన్ని సంస్థలలో జవాబుదారితనం పెరిగిందని, మెరుగైన పాలనకు ఏకైక మార్గం అని పేర్కొన్నారు. టీటీడీలో తప్పకుండా సమాచార హక్కు చట్టాన్ని అమలు చేయడానికి టిటిడి యాజమాన్యంతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిపబ్లిక్ ఎల్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి అంజయ్య, టీటీడీ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ ఎం. ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి, జె భాస్కర్ నాయక్, సభ్యులు డాక్టర్ జి .కృష్ణ, ఆర్. రవికుమార్, పి .కృష్ణమూర్తి , ఎం ముత్తు, ఆర్ పిఐ జిల్లా అధ్యక్షులు ఏ. సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉందాం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, మాదకద్రవ్యాల అక్రమ వినియోగంతో విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతుందని డాక్టర్ బి. చంద్రమౌళి పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాలు మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఏఈఎస్ ఉషశ్రీ సూచించారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి టవర్ క్లాక్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు.

ప్రజాశక్తి - రామచంద్రాపురం: సమాజంలో మాదకద్రవ్యాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి మార్కండేయ నాయుడు కోరారు. గురువారం, కమ్మ కండ్రిగ, అనుపల్లె, మిట్టూరు గ్రామాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆర్ సి పురం పోలీసుల ఆధ్వర్యంలో... అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కమ్మ కండ్రిగ సమీపంలోని నారాయణ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి -దొరవారిసత్రం : తిరుపతి జిల్లా, దొరవారిసత్రంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, వ్యతిరేక దినం సందర్భంగా గురువారం ఏకొల్లు జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణ నుండి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజాశక్తి - సూళ్లూరుపేట : సూళ్లూరుపేటలో డ్రగ్స్ డే సందర్భంగా గురువారం జన జాగరణ ర్యాలీ నిర్వహించారు. పోలీక్రాస్ సర్కిల్ నుంచి బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహం వద్ద వరకు స్కూలు విద్యార్థులు,అంగన్వాడీ వర్కర్లు,పోలీసులతో కలిసి "డ్రగ్స్ వద్దు స్కిల్స్ ముద్దు" నినాదాలతో ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: యువత మత్తుకు బానిస కాకుండా జీవితంలో లక్ష్యం సాధన వైపు నడవాలని ఎస్సై మల్లికార్జున్ పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా గురువారం జూనియర్ కళాశాలలో డ్రగ్స్ విషయంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, ఎంపిడిఓ, కళాశాల ప్రిన్సిపాల్, కళాశాల స్టూడెంట్స్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తడ : తడ మండలం, జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా ర్యాలీ, మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు.

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ ఆవరణ వరకు మాదకద్రవ్యాల నివారణనుద్దేశించి గురువారం ఎంపీడీవో వెంకట రత్నమ్మ, మండల శాఖ అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర మెడికల్ కళాశాల, రుయా హాస్పిటల్ మానసిక విభాగం, మత్తు వ్యసన నిర్మూలన కేంద్రం ఆధ్వర్యంలో రుయా ఆసుపత్రి, భువన విజయం ఆడిటోరియంలో గురువారం మత్తు వ్యసనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రజాశక్తి - క్యాంపస్ : చదువుకునే వయసులో విద్యార్థినిలారా మత్తుకు బానిసతులు కావద్దండి జీవితాలని నాశనం చేసుకోవద్దని పలువురు వక్తలు పద్మావతి డిగ్రీ కళాశాల విద్యార్థినీలకు సూచించారు. శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో మాదకద్రవ్య నివారణ, ర్యాగింగ్ వ్యతిరేక కమిటీ ఆధ్వర్యంలో ప్రపంచ మాదకద్రవ్య నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు.

డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక టిటిడి శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాష్ బాబుమాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా యువతలో మాదకద్రవ్యాల వినియోగం నానాటికి పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోందన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ పేరిట ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయడంపై తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ పార్లమెంట్ అధ్యక్షులు కొట్టే హేమంత్ రాయల్ తీవ్ర హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి - రేణిగుంట: మాదకద్రవ్యాల నివారణ దినోత్సవం సందర్భంగా రేణిగుంట పోలీసులు పట్టణంలో కాలేజీ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో రేణిగుంట ఫ్లైఓవర్ నుండి బస్టాండ్ కూడలి వద్ద వరకు భారీగా ర్యాలీ,మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసులు విద్యార్థులు, రాస్ రాష్ట్రీయ సేవా సమితి వారు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -ఏర్పేడు : మండల కేంద్రమైన ఏర్పేడులో యాంటీ డ్రగ్స్‌డే సందర్భంగా పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితం అంధకారమవుతుందని శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి అన్నారు. శ్రీకాళహస్తి వన్ టౌన్, టూన్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, పొరపాటున వాటికి బానిసలైతే భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ లు గోపి, నాగార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన 6 మంది స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, ఒకొక్కరికి రూ.6 లక్షల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ గురువారం ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు నిచ్చారని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. తిరుపతి జిల్లాకు చెందిన చాంద్ భాషా, అవినాష్, మర్రిచెట్టు నాగరాజు, ధనశేఖర్ అలియాస్ ధనంజయులు, వరదరాజులు అలియాస్ వరదయ్య, మూడే నాగరాజు అలియాస్ గుడుంబా నాగరాజు అలియాస్ నాగరాజు నాయక్ ఎస్వి ఎన్పి ఫారెస్ట్ రేంజ్ టీఎన్ పాలెం సెక్షన్ కరకంబాడి ఫారెస్ట్ బీట్ లో ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ 2017లో టాస్క్ ఫోర్స్‌కు పట్టుబడ్డారన్నారు. ఈ ఆరుగురిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారన్నారు. కోర్టు ఆదేశానుసారం వీరిని నెల్లూరు సెంట్రల్ జైలుకు అప్పజెప్పడం జరిగిందన్నారు

నోట్ల మార్పిడి కేసులో నిందితుల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న నోట్ల కట్టలు చూపుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, సూళ్లూరుపేట: నోట్లు మార్పిడి కేసును పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. దీనికి సంబంధించిన వివరాలను తిరుపతి ఎస్పి హర్షవర్ధన్ రాజు గురువారం మీడియాకు వివరించారు. స్థానిక పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ సూళ్లూరుపేటకు చెందిన చిన్న స్వామి అనే గుర్తు తెలియని వ్యక్తి సూళ్లూరుపేటలో 500 రూపాయలకు, పాత 2000 రూపాయల నోట్ల రెండు రెట్లు ఇస్తామని, వాట్సాప్‌ల ద్వారా కొంతమంది మధ్యవర్తులతో మాట్లాడి కమిషన్ ఇస్తానని తన బిజినెస్ లీగల్ అని చెప్పి, బాధితుడైన జగదీష్‌ను అతనిని మధ్యవర్తుల సహాయంతో ప్రేరేపించారు. అతని ప్లాన్ ద్వారా రెండు ఇన్నోవా కార్లలో కొందరితో వచ్చి, గత నెల ఉదయం 8 గంటల సమయంలో జగదీష్అతని స్నేహితులను కోటి రూపాయలకు, 2 కోట్లు ఇస్తానని నమ్మించి సూళ్ళూరుపేట హైవే వద్దకు పించుకున్నారు. ఒక వ్యక్తిని తన పిఏగా పంపి వారి వద్ద కోటి రూపాయులు డబ్బును పరిశీలించి, అతని ద్వారా జగదీష్‌తో వున్న ఇద్దరినీ దగ్గరలో వున్న ఒక గది వద్దకు వెళ్ళితే తన బాస్ పింక్ 2,000 రూపాయల నోట్లు 21 కోటి ఇస్తారని చెప్పి పంపారు. అదును చూసి జగదీష్ వద్ద వున్న కోటి రూపాయల గల బ్యాగ్‌లను పిఏ తీసుకొని, వారి పథకం ప్రకారం అక్కడికి వచ్చిన ఒక ఇన్నోవా వాహనం ఎక్కి పారిపోతుండగా, జగదీష్ ఆ కారును ఆపడానికి డోర్ పట్టుకోవడంతో వారు అతనిని నెట్టేసి పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సూళ్లూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారని వెల్లడించారు. ఈ కేసులో ముద్దాయిల గురించి పూర్తి వివరాలు తెలియకపోయినప్పటికీ, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో, సూళ్ళురుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.మురళీకృష్ణ, సూళ్ళురుపేట ఎస్ ఐలు బ్రహ్మ నాయుడు, అజయ్ బాబు, కొండపనాయుడు, ఏఎస్ఐ కుమార్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ చిరంజీవి, కానిస్టేబుల్స్ సురేష్, చిరంజీవి, సుహేల్ బాబు సంయుక్తంగా శ్రమించి దర్యాప్తులో సాంకేతికంగా సమాచారం సేకరించి, అత్యంత చాకచక్యంగా ముద్దాయిల వివరాలు తెలుసుకుని, నలుగురు ముద్దాయిలను బుధవారం భూదనం టోల్ ప్లాజావద్ద, ఒకరిని తిరుపతి అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. వారి వద్ద రూ. 73,20,000, నగదు రెండు ఇన్నోవా కార్లు, 2,000/- రూపాయల డమ్మి నోట్ల కట్టలు 6, వైఫై మొబైల్ రౌటర్, 5 సెల్ ఫోన్‌లను స్వాధీనపరుచుకున్నారు. అనంతరం నిందితుల్ని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. నిందితుల అరెస్టు, సొత్తు స్వాధీనానికి సహకరించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో ఏ ఎస్ పి రవి మనోహరాచారి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేరాశ మహిళ.. టక్కరి దొంగలు



ఆటో ఎక్కుతున్న దృశ్యం (ఇన్ సెట్‌లో బాధితురాలు సునీత)

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పేరాశకు పోయిన ఓ మహిళను టక్కరి దొంగలు బురిడీ కొట్టించి బంగారు ఆభరణాలు తస్కరించిన సంఘటన గురువారం టూ టౌన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుకు చెందిన సునీత గజేంద్ర నగర్‌లోని ఓ సచివాలయం పరిధిలో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 23వ తేదీ పట్టణంలోని కొండమిట్ట ప్రాంతంలో డయేరియా వ్యాధి నివారణపై అవగాహన కల్పించేందుకు కాలినడకన బయలుదేరింది. పెద్ద మసీదు వీధిలో వెళ్తుండగా ముగ్గురు యువకులు ఆమెతో మాటలు కలిపారు. హిందీలో మాట్లాడుతున్న యువకుడు అమాయకుడనీ, ఆయన వద్ద రెండు లక్షల వరకు నగదు ఉందనీ, హోటల్ కోసం వెతుకులాడుతున్నట్లు నమ్మించారు. పూసల వీధిలో ఉన్న నందిని హోటల్, నగిరి వీధిలో ఉన్న నవయుగ హోటల్ వరకు ఆమెను తమ వెంట తిప్పుకొని చివరకు ఆటోలో శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు తీసుకెళ్లారు. మూసివున్న ఓ దుకాణం వద్ద పంచాయతీ పెట్టి ఆమె వద్ద ఉన్న నగలకు, హిందీ యువకుడి వద్ద ఉన్న నగదుకు బేరీజు వేశారు. బేరం పెట్టారు. వాటర్ బాటిల్ తీసుకొస్తామని, నమ్మకం కోసం నీ వద్ద ఉన్న నగలు మాకు ఇచ్చి, మా నగదు అందాకా నీ వద్ద ఉంచాలని సూచించారు. అందుకు ఆ మహిళ ఒప్పుకోవడంతో వాటర్ బాటిల్ తీసుకొచ్చి ఆమెకు తాగించారు. ఆ పైన ఆమెకు నగలు, డబ్బు ఉన్న సంచిని చేతికి ఇచ్చి ఆటో ఎక్కించారు. కూరగాయల మార్కెట్ సమీపంలోని సచివాలయం వద్ద దింపి వెళ్ళిపోయారు. తీరా సంచిలోపల నగలు, డబ్బు లేకపోవడంతో మహిళ ఖంగుతినింది. మోసపోయానని గ్రహించి 24వ తేదీన టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సచివాలయ ఉద్యోగిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగార్జున రెడ్డి తెలిపారు. ఇప్పటికే లభించిన సిసి పుటేజ్ ఆధారంగా టక్కరి దొంగలను త్వరలోనే పట్టుకుంటామని గురువారం మీడియాకు తెలిపారు. కాగా తనను హిప్నటైజ్ చేసి యువకులు నగలు దోచుకెళ్లినట్లు బాధిత సచివాలయ ఉద్యోగిని పేర్కొంది.

మై టీచర్ నాన్నరేల్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం సావేరీ సెమినార్ హాల్లో ఆంగ్ల శాఖకు చెందిన ఆచార్య పి. హరి పద్మ రాణి రచించిన "మై టీచర్ నాన్నరేల్" అనే పుస్తకాన్ని గురువారం ఆవిష్కరించారు. వైస్ ఛాన్సలర్ ఆచార్య వి. ఉమ, రెజిస్ట్రార్ ఎన్.రజని, ప్రముఖ రచయిత,పూర్వ ఆంగ్ల ఆచార్యులు మధురాంతకం నరేంద్ర విశిష్ట అతిథిగా హాజరయి రచయితను అభినందించారు.